**కథ**

# అల్లుడరికం

**వాణిశ్రీ**

**తల్లి సంవత్సరీకానికి గుంటూరులో వున్న అన్న ఇంటికి వచ్చింది శ్రీలక్ష్మి.**

**“మీ ఆయన రాలేదేం?” అడిగాడు రామారావు.**

**“ఎక్కడన్నయ్యా! ఆయనకి తీరికేది? ఎప్పుడూ టూర్లు. నన్ను వెళ్ళిరమ్మన్నారు” అన్నది శ్రీలక్ష్మి.**

సంవత్సరీకం కార్యక్రమం ముగిసిన తర్వాత శ్రీలక్ష్మి రామారావు ఏకాంతంగా వున్నప్పుడు కలిసింది.

“అన్నయ్యా! మీ బావ ఒక విషయం అడగమన్నారు” అన్నది.

“ఏ విషయం?”

“అదే! ఆస్తిలో ఆడపిల్లలకి కూడా వాటా ఇవ్వమని రూలొచ్చిందటగా” అన్నది.

“నన్నడుగుతావేం? నాన్నని అడుగు” అన్నాడు రామారావు.

“నాన్నని అడిగితే నాదేవుంది? అన్నయ్యని అడుగు అన్నాడు”

“ఆస్తి ఏవుందమ్మా? గరికపాడులో ఆరు ఎకరాలు. నీకు తెలుసుగా. నాన్న సంపాదించింది ఏవుంది? ఈ ఇల్లు నేను లోన్ తీసుకుని కట్టించుకున్నదే” అన్నాడు రామారావు.

“గరికపాడు పొలంలో సగం నాకు ఇవ్వు” అన్నది శ్రీలక్ష్మి.

“ఆస్తిలో భాగం అడుగుతున్నావు బాగానే వుంది. మరి బాధ్యతలో?” అన్నాడు రామారావు.

“బాధ్యతలు ఏమిటి?”

“నాన్న గవర్నమెంట్ జాబ్ ఏం చేయలేదు. నెల నెలా పెన్షన్ రావడానికి. సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేసి రిటైరైనందుకు వచ్చిన గ్రాట్యుటీ, పి.యఫ్. చేసిన అప్పులకు సరిపోయాయి. నీకు అదంతా తెలుసుగా. ఆ పొలం కూడా అమ్మకు పుట్టింటి వాళ్ళు ఇచ్చిందే”

“ఆ..” అన్నది శ్రీలక్ష్మి.

“నాన్నకు ఆధారం గరికపాడు పొలం మీద వచ్చే కౌలేగా! అది కాస్తా చెరిసగం తీసుకుంటే ఎట్లా?” అన్నాడు రామారావు.

“ఇంతకీ నువ్వేమంటావు?” అసహనంగా అడిగింది శ్రీలక్ష్మి.

“నేను అనేదేముందమ్మా! బావగారికి చెప్పు నాన్న తదనంతరం పొలం తీసుకోవచ్చు అని”

“ఆ...అప్పటికి రాజెవరో, రెడ్డెవరో అని...” నసిగింది శ్రీలక్ష్మి.

“ఏంటీ బావగారు గట్టిగా కావాలంటున్నారా?” అడిగాడు రామారావు.

“ఆ..”

“ఒక పని చెయ్యి. గరికపాడులో వున్న ఆరు ఎకరాలు నువ్వే తీసుకో. నాకేం అక్కర్లేదు” అన్నాడు రామారావు.

శ్రీలక్ష్మి ముఖం మతాబులా ఒక్కసారిగా వెలిగిపోయింది.

“ఐతే నాన్న బాధ్యత గూడా నువ్వే తీసుకో. ఎందుకంటే పొలం నీకిచ్చి నాన్నని నా దగ్గర వుంచుకుంటే మీ వదినకు కష్టంగా వుంటుంది గదా! ఏమంటావు?” అన్నాడు రామారావు.

“నిజమే” ఒప్పుకుంది శ్రీలక్ష్మి.

“నువ్వు హైదరాబాదెళ్ళి బావగారితో మాట్లాడి లెటర్ రాయి. ఏమంటావు?” అన్నాడు రామారావు.

“సరే అన్నయ్యా! నువ్వు చెప్పింది బాగానే వుంది. బావతో మాట్లాడి లెటర్ రాస్తాను” అన్నది శ్రీలక్ష్మి.

“బాగా ఆలోచించుకోండి” హెచ్చరించాడు రామారావు.

తల వూపింది శ్రీలక్ష్మి.

పొద్దున్నే లేచి పల్నాడు ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ వెళ్ళిపోయింది శ్రీలక్ష్మి.

చెల్లెలు వెళ్ళిపోయిన తర్వాత గరికపాడు పొలంలో భాగం గురించి శ్రీలక్ష్మి అడగడమూ, తను చెప్పిన ప్రపోజల్ భార్యకు చెప్పాడు రామారావు.

“వాళ్ళకే ఇచ్చెయ్యండి ఆ పొలం” అన్నది రామారావు భార్య.

“ఇక నాన్నకి చెప్పాలీ సంగతి” అన్నాడు.

“ఆయనకేం? హైదరాబాద్ అంటే ఎగిరి గంతెయ్యడూ?” అని నవ్వింది రామారావు భార్య.

* * *

“ఏమిటీ పొలం మొత్తం నిన్నే తీసుకోమన్నాడా మీ అన్న? వండ్రఫుల్‌గా వుందే? సగం ఇవ్వడానికే పేచీ పెడతాడనుకున్నాను” అన్నాడు సుధాకర్ ఆశ్చర్యపోతూ.

“మా అన్నయ్య మీలా పేచీకోరు కాదులెండి. ఐనా మా గుంటూరు జిల్లా వాళ్ళు మీ కృష్ణా జిల్లా వాళ్ళలా డొంక తిరుగుడు వ్యవహారాలు నడపరు. మాదంతా ముక్కుసూటి వ్యవహారం” అన్నది శ్రీలక్ష్మి.

“ఇప్పుడు ఆంధ్రా, తెలంగాణా, రాయలసీమ అని ప్రాంతాల వారిగా కొట్టుకు ఛస్తుంటే నువ్వు జిల్లాల మధ్య చిచ్చుపెట్టేలా వున్నావే” అని నవ్వాడు సుధాకర్.

“ముందు ముందు అవి గూడా మొదలవ్వవని గ్యారంటీ ఏవుంది?” అన్నది శ్రీలక్ష్మి.

“ఆ గొడవ మనకెందుకుగాని గరికపాడు పొలానికి కౌలు ఎంతొస్తుందేం?” అడిగాడు సుధాకర్.

“ఏమో? మా మావయ్య కౌలుకి చేస్తున్నాడు. ఎంత ఇస్తాడో తెలీదు. సంవత్సరానికొకసారి గుంటూరొచ్చి నాన్నకి కౌలు ఇస్తాడు. వచ్చేటప్పుడు ఎండు మిరపకాయలు, పండు మిరపకాయల పచ్చడి, చింతకాయల తొక్కు వగైరాలన్నీ తెస్తాడు”

“ఇకనేం ముందు ముందు అవన్నీ హైదరాబాద్ తెస్తాడ్లే మీ మావయ్య” అన్నాడు సుధాకర్.

“మరి అన్నయ్యకి లెటర్ రాస్తారా?” వుత్సాహంగా అన్నది శ్రీలక్ష్మి.

“లెటరెందుకు? ఫోన్ చేస్తాలే” హుషారుగా అన్నాడు సుధాకర్.

మర్నాడే రామారావు ఆఫీసుకి ఫోన్ చేశాడు సుధాకర్.

“నాన్నని పంపడానికి తొందరెందుకు? మీరొచ్చి పొలం రాయించుకుని రిజిస్ట్రేషన్ చేయించుకోండి. అలాగే నాన్న బాధ్యత మీదేనని అగ్రిమెంట్ రాసివ్వండి. ఎందుకైనా మంచిది గదా!” అన్నాడు రామారావు.

ఇదేదో బాగానే వుందని శ్రీలక్ష్మి, సుధాకర్ వెళ్ళి ఆంజనేయులుతో పొలం రాయించుకుని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అలాగే రామారావు బావగారితో తన తండ్రి ఆంజనేయులు బాధ్యత తనదేననీ, జీవితాంతం పోషిస్తాననీ అగ్రిమెంట్ రాయించుకున్నాడు.

ఆంజనేయులు కూతురు, అల్లుడితో హైదరాబాద్ బయల్దేరాడు.

* * *

చైతన్య అపార్ట్‌మెంట్స్‌లో వున్న పాతిక ఫ్లాట్స్ వాళ్ళని సెల్లార్‌లో సమావేశపరచి పార్టీ ఇచ్చింది శ్రీలక్ష్మి. పుల్లారెడ్డి స్వీట్స్, కూల్ డ్రింక్స్ సర్వ్ చేసింది. అందరికీ తన తండ్రి ఆంజనేయుల్ని పరిచయం చేసింది. గరికపాడులో వున్న మొత్తం ఆరు ఎకరాల పొలం తనకే ఇచ్చేశాడనీ, ఇకనుంచీ తమ దగ్గరే వుండి పోతాడనీ అనౌన్స్ చేసింది.

అందరూ క్లాప్స్ కొట్టి హర్షం వెలిబుచ్చారు.

అపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్ ఆంజనేయుల్ని పొగిడాడు. పనిలో పనిగా ఆయన కొడుకు రామారావుని కూడా ఆకాశానికి ఎత్తేశాడు. అందరూ ఈ తండ్రీ కొడుకుల్లా ఆడపిల్లలకు ఆస్తులు పంచి ఇస్తే భారతీయ సంస్కృతి చెక్కు చెదరకుండా నిలబడి పోతుందనీ, కుటుంబాల మధ్య పోట్లాటలే వుండవనీ లెక్చర్ దంచాడు. ఎంతైనా సుధాకర్, శ్రీలక్ష్మి దంపతులు అదృష్టవంతులన్నాడు.

సమావేశం ముగిశాక "ఏమయ్యా సుధాకర్ ఆరెకరాల పొలం అప్పనంగా కొట్టేశావ్. మరి మాకు మందు పార్టీ ఏది?" అన్నాడు ప్రెసిడెంట్.

"కొలు రానీయండి పార్టీ ఇస్తాను" అని నసిగాడు సుధాకర్.

ఈ పొలం రాయించుకోడానికి గుంటూరెళ్ళడం, డాక్యుమెంటేషన్, రిజిస్ట్రేషన్ ఫీజులు వగైరా తడిసి మోపెడై డబ్బుకి బాగా టైట్‌గా వుంది సుధాకర్‌కి. ఆఫీసులో లోన్ కూడా తీసుకున్నాడు. వచ్చే నెల నుంచి కటింగ్ కూడా మొదలవుతుంది. ఆ కొలేదో వచ్చేవరకు తిప్పలే.

ప్రెసిడెంట్, సెక్రటరీలతో సుధాకర్ గుసగుసలాడ్డం గమనించిన కొందరు వాసన పట్టారు. కాస్త ఓపిక పడితే గొంతు తడవక పోతుందా అని సెల్లార్‌లోనే అటూ తారట్లాడారు. డిన్నర్ టైమైందని కొందరు వెళ్ళిపోగా, పెళ్ళాలకు భయపడి మరికొందరు జారుకోగా, ఏడుగురు మిగిలారు. సుధాకర్ గుండె గుభేలుమంది. వీళ్ళని తీసుకుని బార్‌కెళ్తే రెండు వేలకి తక్కువ బిల్లుకాదు. ఆ మాటే ప్రెసిడెంట్ చెవిన వేశాడు. ప్రెసిడెంట్ ఫక్కున నవ్వి "బార్‌కెందుకూ ఆవదం. నా ఫ్లాట్‌లో పెట్టేద్దాం దుకాణం" అని "ఒరేయ్! నాగన్నా" అని కేకేశాడు. వాచ్‌మేన్ పరిగెత్తుకొచ్చాడు.

"సార్ డబ్బులిస్తాడుగాని రెండు మెక్‌డోల్ విస్కీ ఫుల్ బాటిల్స్, కిలో పకోడీలు, ఒక ఏభై బజ్జీలు పట్టుకురా!" అన్నాడు ప్రెసిడెంట్.

సుధాకర్ ఏడ్చుకుంటూ డబ్బులిచ్చాడు.

నాగన్న పోతూ వుండగా ప్రెసిడెంట్ మళ్ళీ అరిచాడు.

"ఒరేయ్! పెద్దసైజు సోడా బాటిల్స్ రెండు మర్చిపోకు"



ప్రెసిడెంట్ రాజారావు 'బ్యాచిలర్'నని గొప్పగా చెప్పుకుంటాడు. పిల్లలు అమెరికాలో సెటిలయ్యారు. భార్య స్వర్గానికి వెళ్ళిపోయింది. రాజారావు బ్రహ్మచారిగా మిగిలిపోయాడు. రోజూ విస్కీతో గొంతు తడుపుకోవాల్సిందే! అందుకు సాకులు వెదుకుతూ వుంటాడు. ఎవరింట్లో బర్త్‌డే జరిగినా, శారీ వేరింగ్ ఫంక్షన్‌గానీ, సత్యనారాయణవ్రతంగానీ సదరు గృహస్తుని పీడించి మందు పార్టీ ఏర్పాటు చేయిస్తాడు. రాజారావు ఫ్లాటు బార్‌గా మారిపోతుంది.

రాత్రి తొమ్మిది దాటింది.

"నాన్నా లే భోంచేద్దువుగాని" అన్నది శ్రీలక్ష్మి.

"అల్లుడు రానీయమ్మా! నాకేం తొందర? రెడ్డి మిఠాయిని తినిపించావు. అంతా నెయ్యి కాబోలు. కడుపులో మందంగా వుంది" అన్నాడు ఆంజనేయులు.

"ఆయన ఎప్పుడొస్తాడో? నువ్వు కానీ.." అని శ్రీలక్ష్మి తొందరపెట్టినా ఆంజనేయులు లేవలేదు.

ఫ్లాట్‌లో నుంచి బైటకొచ్చి కాసేపు పార్కింగ్ ప్లేస్‌లో అటూ ఇటూ తిరిగాడు.

అప్పుడే నాగన్న ఆంజనేయులు కంటపడ్డాడు. నల్లటి కేరీ బ్యాగ్‌లో ఏం వుందో ఇట్టే పసిగట్టాడు. వాచ్‌మేన్ మరో ఫుల్ బాటిల్ మోసుకొస్తున్నాడు.

ఫస్ట్ ఫ్లోర్‌లోనే వున్న రాజారావు ఫ్లాట్‌లోకి నాగన్నతో పాటు ఫాలో అయిపోయాడు.

ఆంజనేయుల్ని చూసి అంతా తేలుకుట్టిన దొంగల్లా అయిపోయారు. ఇక సుధాకర్ మామగారిని చూసి 'హి..హి' అని ఏడవలేక నవ్వి "మనోళ్ళు పార్టీ అడిగారు మావయ్యా!' అని కుర్చీలోంచి లేచాడు.

"దాన్దేవుందిలే అల్లుడూ! ఇదంతా మామూలే" అని నవ్వాడు.


విస్కీతో కూడిన పకోడి వాసనకి ఆంజనేయులు నోట్లో నీళ్ళూరాయి.

"వస్తా గురూగారూ!" అంటూ తడబడుతూ నెమ్మదిగా జారుకున్నాడు సుధాకర్.

అల్లుడు ఖాళీ చేసిన కుర్చీలో ఆసీనుడయ్యాడు మామ.

★ ★ ★

ఆంజనేయులికి గుంటూరు కంటే హైదరాబాదే నచ్చింది. ముఖ్యంగా ప్రెసిడెంట్ రాజారావుతో దోస్తీ కుదిరింది. ఆ కాలనీలో మరికొందరు గూడా వీరివంటి బ్యాచిలర్స్ వున్నారు. రాజారావుకేం వాళ్ళ కొడుకులు నెల నెలా డాలర్లు పంపిస్తారు. కొందరు పెన్షనర్స్ వున్నారు. ఇంకేం మందు పార్టీలు జోరుగా సాగుతున్నాయి.




ఆంజనేయులు మొహమాటం లేకుండా కూతుర్ని "అమ్మాయ్! ఒక వంద ఇవ్వు, ఏభై ఇవ్వు" అని డిమాండ్ చేసి తీసుకుంటున్నాడు. సిగరెట్లు తాగడం కూడా ఎక్కువైంది.

ఒక రోజు రాజారావు 'డే కేర్ సెంటర్' అని ఒక ఆఫీసుకి తీసుకెళ్ళాడు. అది సీనియర్ సిటిజన్స్ సంఘం. ఆంజనేయుల్ని పరిచయం చేశాడు రాజారావు. "మీరు కూడా మెంబర్‌గా చేరండి. వృద్ధుల సమస్యల మీద పోరాటం చెయ్యాలి. మనకు బస్సుల్లో రైళ్ళల్లో రిజర్వేషన్లు కావాలి. నర్సింగ్ హోమ్స్‌లో డిస్కౌంట్లు కావాలి" అని చిన్నపాటి వుపన్యాసం దంచాడు.

ఆ ఆఫీసు పార్కులోనే ఒక మూలంగా వుంది. అందులోనే రీడింగ్ రూమ్ వుంది. కొంతమంది పాలిటిక్స్ డిస్కస్ చేస్తున్నారు. ఇదేదో బాగానే వుందే అనుకున్నాడు. అంతా అరవై ఏళ్ళు దాటిన వాళ్ళే.

మర్నాడు "అమ్మాయ్! ఐదొందలు ఇవ్వు. డే కేర్ సెంటర్లో చేరతా" అన్నాడు ఆంజనేయులు.

"అదేంటి నాన్నా!" అని అడిగింది శ్రీలక్ష్మి.

ఆంజనేయులు వివరంగా చెప్పాడు.

"ఈరోజుల్లో ముసలాళ్ళని ఎవరు మాత్రం పలకరిస్తున్నారు? అందుకే అంతా సంఘంలా ఏర్పడి ఒకరినొకరు పలకరించుకుంటున్నారు" అన్నాడు.

"మనకెందుకు నాన్నా?" అన్నది.

కానీ వినలేదు. ఆ సెక్రెట్రీ చెప్పిన వృద్ధుల సమస్యల మీద స్పీచ్ మొదలుపెట్టాడు. శ్రీలక్ష్మి అదంతా వినలేక "సర్లే నాన్నా! ఆయనొచ్చాక తీసుకుని ఇస్తాలే" అన్నది.

మామగారికి ఐదొందలు కావాలనేసరికి సుధాకర్‌కి మండుకొచ్చింది. నెలాఖరు. స్కూటర్లో పెట్రోలుకి, కూరగాయలకీ తడుముకుంటున్నాడు. ఇప్పుడు సడన్‌గా ఐదు రూపాయలు కావాలని అడిగినట్లు ఐదొందలు అడిగేసరికి నషాళానికి అంటింది మంట.

మొదటిసారిగా ఈ మావని నెత్తిన ఎందుకు పెట్టుకున్నాన్రా దేవుడా? అని విచారించాడు సుధాకర్.

నెలకి ఎంతలేదన్నా సిగరెట్లకి, మెడిసిన్స్‌కి, రాజారావు ఫ్లాట్‌లో పార్టీలకనీ, మావ ఎకౌంట్లో వెయ్యి రూపాయల పైన వదుల్తున్నాయి. ఆదివారం వస్తే, తెల్లారకుండానే 'అమ్మాయ్ డబ్బులియ్యి చేపలు పట్టుకొస్తా, లేటైతే మంచివి వుండవు' అని వెళ్ళడం మొదలుపెట్టాడు. మొదటి సండే మటన్, రెండో సండే చికెన్, మూడో సండే చేపలు, నాలుగో సండే మళ్ళీ మటన్, మధ్య మధ్య పప్పు తిని జిహ్వ చచ్చిందనో, కూరగాయలు బోరు కొడుతున్నాయనో చికెన్ లెగ్స్ అనో, మటన్ చాప్స్ అనో పట్టుకొస్తున్నాడు. 'డబ్బులెక్కడివి' అంటే రాజారావు దగ్గర తీసుకున్నాననో, వెంకయ్య సర్దాడనో, ఫస్టుకి ఇవ్వొచ్చులే, కంగారు లేదు అంటాడు. ఫస్ట్ వచ్చేసరికి వెయ్యి దాకా అప్పులు చేసి రెడీగా వుంటున్నాడు.

ఈవిధంగా మామగారి అల్లుడరికం వల్ల బడ్జెట్ పెరిగిపోయి సుధాకర్ కంగారుపడుతున్నాడు. శ్రీలక్ష్మితో తన గోడు వెళ్ళబోసుకుంటే 'ఆరు ఎకరాల కౌవులొస్తుందిగా! కంగారు పడతారేం?' అని విసుక్కుంటోంది.

సంవత్సరం తిరిగేసరికి పాతిక వేలు బడ్జెట్ పెరిగిపోయి సుధాకర్ కళ్ళు తిరిగిపోయాయి.

ఆఫీసులో ఫెస్టివల్ అడ్వాన్సులు, ఎడ్యుకేషనల్ లోన్, మోటార్ బైక్ లోన్ వగైరాలతో జీతం కటింగైపోతోంది. చేతికొచ్చేది తగ్గిపోయి డి.ఏ. ఎప్పుడు పెంచుతారా అని ఎదురు చూడాల్సిన దుర్గతి పట్టింది.

"మీ మావయ్యని కౌలు డబ్బులు పట్టుకు రమ్మని లెటర్ రాయి" అని శ్రీలక్ష్మిని సతాయించసాగాడు సుధాకర్.

శ్రీలక్ష్మి నాలుగు ఉత్తరాలు రాశాక ఒకరోజు పొద్దున్నే గరికపాడు నుంచి ఆమె మేనమామ నరసయ్య మనవడిని వెంటేసుకుని హైదరాబాద్ వచ్చాడు.

వస్తూ వస్తూ ఎండు మిరపకాయలు, పండు మిరపకాయల పచ్చడి, పులిహోర గోంగూర, చింతకాయల తొక్కు వగైరా మేడిన్ గరికపాడు బ్రాండెడ్‌వన్నీ మోసుకొచ్చాడు. ఆయన్ని చూస్తూనే సుధాకర్ సంబరపడిపోయాడు.

"బాబాయికి గారెలు వండి పెట్టు" అని శ్రీలక్ష్మికి పురమాయించాడు.

మేనకోడలి మొగుడు చేస్తున్న అతిథిమర్యాదలకు సంతోషించాడు నరసయ్య.

"అబ్బాయ్! బస్సుకి పోతా! తెల్లారక ముందే కారంపూడి పోద్దంటగా!" అన్నాడు నరసయ్య.

"అంత చీకట్లో కారంపూడిలో దిగి మీ వూరెట్లా వెళ్తారు?" అన్నాడు సుధాకర్.

"ఇప్పుడు పెద్ద ఆటోలు వూళ్ళల్లో తిరుగుతున్నాయిలే.." అన్నాడు.

తర్వాత పంచె మడతల్లో నుంచి నోట్ల కట్ట తీసి ఇచ్చి "ఇదుగో మీ కౌలు డబ్బులు" అన్నాడు.

సుధాకర్ లెక్కబెట్టగా మూడు వేలున్నాయి. కనీసం ఎకరానికి పదివేలు కౌలు వేసుకున్నా ఆరెకరాలకి అరవై వేలు వస్తాయని కలలుకంటున్న సుధాకర్ షాక్ తిన్నట్లయిపోయాడు.

"అదేంటి బాబాయిగారూ! మూడు వేలే ఇచ్చారు? మిగతావి?" అన్నాడు.

"మిగతాయేందబ్బాయ్! ఎకరానికి ఐదొందలు. మీ ఆరెకరాలకి మూడు వేలేగా?" అన్నాడు నరసయ్య.

సుధాకర్ నోట మాట రాలేదు.

శ్రీలక్ష్మి గుడ్లు తేలేసింది.

"ప్రతి ఏడూ మీ మావయ్య ఇచ్చే కౌలు అంతేనమ్మాయ్!" అని వంత పాడాడు ఆంజనేయులు.

"వర్షాల్లేవు. పండి చావడం లేదు ఇన్నాళ్ళూ. ఇప్పుడు, పోయినేడు వర్షాలు పడితే పండిన పంటకి రేటు లేదు. అంతా మాయగా వుందబ్బాయ్! ఏందో ఏం చెయ్యలేక పంట వెయ్యడమే" అన్నాడు నరసయ్య నిట్టూరుస్తూ.

సుధాకర్‌కి నషాళానికి ఎక్కింది కోపం. నరసయ్య తమను తెలివి తక్కువ వాళ్ళను చేస్తున్నట్లు ఫీలయ్యాడు.

"మా పొలం అమ్మేసి డబ్బు ఇవ్వండి" అన్నాడు ముఖం మాడ్చుకుని.

నరసయ్య పక పక నవ్వాడు.

"పొలం అమ్మడమా? అక్కడ కొనేవాడెవడు? ఆ పక్కన వూళ్ళో ఒక కంపెనీ వోడికి వెయ్యి ఎకరాలుంది. ఎకరం పది వేలకి అమ్ముతానని పేపర్లో ఏస్తేనే కొనే దిక్కు లేదు" అన్నాడు.

"ఏం?" గొంతులో తడి ఆరిపోతుండగా అన్నాడు సుధాకర్.

"ఏం అంటే ఏం జెప్పను? పల్నాడు నక్సలైట్ల ఏరియా అని ఎవడూ కొనడం లేదు. కొనేవాడుంటే ఐనకాడికి అమ్మేసి ఎటైనా పోదామని నేనూ చూస్తున్నా!" అన్నాడు నరసయ్య.

సుధాకర్, శ్రీలక్ష్మి బిత్తరచూపులు చూస్తుండగా నరసయ్య మనవడిని వెంటబెట్టుకుని బయల్దేరాడు. ఆంజనేయులు బామ్మర్దిని బస్సెక్కించి రావడానికి వాళ్ళ వెంట వెళ్ళాడు, 'అల్లుడరికంలో వున్న మజా' అని పాడుకుంటూ.

